# రాతు మెత్తనయితే....?

రోడ్స్ అండ్ బిల్డింగ్స్ డిపార్ట్‌మెంట్‌లో ఒకమామూలు సూపరింటెండింగ్ ఇంజనీర్ నవనీత రావు. ఈ విభాగానికే పూర్వం పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ అని పేరుండేది. కానీ అప్పుడూ, ఇప్పుడూగూడా సూపరింటెండింగ్ ఇంజనీర్‌ను సంక్షిప్తంగా ''యస్.సి.'' అనే పిలుస్తారు.

నవనీత రావుకు నవనీతంవంటి భార్య లెందరు? పాలకోవావంటి పిల్లలెందరు? అనే ప్రశ్నలకు ఈ కథలో తావులేదు. కారణం, ఈ కథంతా నవనీతరావు ఆఫీసుకే పరిమితం, అటువంటప్పుడు అతని వ్యక్తిగత కుటుంబ విషయాల వెతుకులాట ఇక్కడ అనావశ్యకమే కదా! అనావశ్యకమనేది నిజమే అయినా ఈ కథంతా ఒక్కరోజులో పూర్తైపోయేది కాదుకదా! కాకపోతే, ఈ కథ ముగిసేంతవరకూ పాపం ఎస్.సి. గారిని ఆఫీసులోనే తాళంవేసి ఉంచలేంకదా! అటువంటి దురుద్దేశ్యాలేవీ నాకు లేవు సుమండీ! ఆయనను రోజూ సాయంత్రంపూట హాయిగా ఇంటికి వెళ్ళమనండి, కానీ, ఏ ఇంటికి వెళ్ళినా తిరిగి ఇదే ఆఫీసుకు రావాలికదా!

ఏ ఆఫీసరైనా, ఆఫీసు విషయాల గూర్చి, అక్కడి సమస్యల గూర్చి భార్యతో సంప్రదించకుండా ఉండ గలడా? కొన్ని కుటుంబాలలో ఆఫీసుకు వెళ్ళేది భర్త అయినా, అక్కడి సమస్త విషయాలూ బాగా తెలిసేది భార్యలకే, ఆఫీసులోని సంక్లిష్టమైన సమస్యలపై అంతిమ తీర్పు నందించేది గూడా ఇటువంటి హోంమినిస్ట్రీలే.

ఆఫీసుల్లోనూ, ఇండ్లలోనూ ఇలాంటి పరిస్థితులే ఉన్నా. ఈ కథలో మాత్రం దుశ్శాసనుడు జుట్టుపట్టి ఈడ్చు కొచ్చిన ద్రౌపదిలా, నవనీతరావు భార్యను ప్రవేశపెట్టటం

మాత్రం మర్యాద కాదు. కారణమేమిటంటే నవనీతరావుకు ఆనాటి పాచికలాట కాదుకదా, ఈనాటి రమ్మీ ఆటగూడా తెలియదు.

అది సరేనయ్యా... నీవు కథను ముందుకు నడిపిస్తావా లేక నన్ను చదవటం మానేయమంటావా?

ప్రియమైన పాఠకులారా... అటువంటి అభిప్రాయిత్యానికి పూనుకోకండి.. ఇహ అసలు సిసలు కథనే మీ ముందుంచుతాను. ఈ కథ మరీ చిట్టిపొట్టిది కావటంవల్ల, మీరు దీనికి 'మినీకథ' అని పేరు పెడతారేమో అని భయపడి, కొద్దిగా సాగదీయటానికి ప్రయత్నంచేశాను. సారీ! ఇహ ఒక్క సెకెండును గూడా వృథా చేయకుండా సూటిగా కథలోకే అడుగు పెడుతున్నాను.

నవనీతరావు వయసు ఏభై సంవత్సరాలుండవచ్చు. లేకపోతే ఏభైరెండు అని అనుకోండి. అతను చాలా సీదా సాదా మనిషి. కానీ, ఎండతాకిన వెన్నలా కరిగిపోయే మనిషి మాత్రం కాడు. ఎంత సున్నితమైన మనస్సు ఉన్నవాడైనా అవసరమైనప్పుడు దృఢంగా వ్యవహరించగలడు.

ఇహ అతని స్వభావ వర్ణన, శరీర వర్ణన మొదలు పెట్టవద్దు. అతని రంగు, ఎత్తు వీటన్నింటితో మాకెటువంటి సంబంధం లేదు. అతనెలా ఉన్నా మాకెటువంటి అభ్యంతరం లేదు. అందుకే వర్ణనలు ఇక ఆపి కథా కథనం సాగించండి.

కానీ వర్ణనలు చేయకుండా కథనెట్లా నడపగలను? వర్ణన కథకు గుండెవంటిది. మీ కిష్టం లేకపోతే నవనీతరావును గూర్చిన వర్ణన వదిలివేస్తాను. కానీ కిష్టయ్య గూర్చి కొద్దిగా వివరించకుండా ముందుకు పోవటం నాకు సాధ్యంకాదు.

ఇహ రెండు మూడు విషయాలను మాత్రం ప్రస్తావించి నా లఘు ప్రసంగాన్ని ముగిస్తానని చెప్పింతర్వాత గూడా అర్థంగంటదాకా మైకు ఏక పట్టును వదలకుండా మహా బోరుకొట్టించే నాయకుడి లాగా కిష్టయ్యవర్ణన అంటూ మూడు పేజీలు నింపవద్దు, అసలీ కిష్టయ్య ఎవరు? నవనీతరావు బావేనా? లేక అతను ఉంచుకొన్న చిలుక మొగుడా?

మీరుఇట్లా యక్షప్రశ్నలు వేసి విసిగించకపోతే కథను త్వరగా ముగిస్తాను. ముగిస్తాను అన్నది మీ కథగాదయ్యో, ఈ కథను తొందరగా పూర్తి చేస్తానని మాత్రమే, ఈ కిష్టయ్య వేరెవరో కాదు, నవనీతరావు సేవకొఱకు కంకణం కట్టుకొని అతని గదిముందు కూర్చొనే ధవళవస్త్రధారుడైన అటెండరే.

ఇతర అటెండర్లు మామూలు స్టూలుమీద కూర్చొంటే ఇతను మాత్రం చక్కటి చెక్కకుర్చీపై సుఖాసనుడై ఉంటాడు. ఇతను పేరు మీద ఎటువంటి కుర్చీకీ శాంక్షనూ లేకపోయినా, దానిమీద కిష్టయ్య దర్జాగా కూర్చోటం సాటి అడెండర్లకు అసూయను, ఆశ్చర్యాన్నీ అతని పట్ల కల్గించాయి. హైకోర్టు జడ్జీలు సైతం ''బెంచి'' మీద కూర్చుంటున్నప్పుడూ, స్టూలుమీద కూర్చోటానికి కిష్టయ్యకు అంత నామోషీ ఎందుకని వాళ్ళు చర్చించు కొన్నారు. కిష్టయ్య ఒరిజినల్ పేరు కృష్ణయ్య. కిష్టయ్య అని పిలవటమే అతని స్వరూపానికీ, స్వభావానికీ ఎంతో ఎక్కువ. అతన్ని గూర్చి బాగా తెలిసిన వాళ్ళు అతణ్ణి ''కుష్టయ్య'' అని పిలవటమే సమంజసం అనుకొంటారు. అతని ముఖ కవళికలు, ముఖభావాలు, ప్రవర్తనాధోరణి చూసినవారికి అతన్ని కర్కోటకుడనో ధూమ కేతువనో కాలకూట వి విషమనో గార్దభ పుత్రుడనో పిలవాలని పిస్తుంది. ఉదయమే లేచి అతని ముఖం చూసినవారికి కీడు తప్ప ఏ మేలూ కలగదు. పొద్దున్నే లేచి తనముఖం తనే అద్దంలో చూసుకొంటాడనే దానికి తార్కాణం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో రోజూ కనీసం పదిమంది నుండైనా ఘోరమైన తిట్లు అతను తినటమే. రెండు నిమిషాల క్రితమే పచ్చిచింత పులుసు త్రాగినట్లు ఉంటాయి అతని ముఖ భంగిమలు. అసహ్యకరమైన ఆనోరు తెరిస్తే బూతులే వెళ్ళు కొస్తాయి. ఆ మాటలు వింటే కాలువిరిగి ఫ్రాక్చర్‌తో ఉన్నవాడైనా, ఆకాలుతోనే కిష్టయ్యను ఈడ్చి తన్నాలనిపిస్తుంది. అతని ముఖంలో కుడివైపు చౌకబారుతనం కన్పిస్తుంటే, ఎడంవైపు అహంకారం దర్శనమిస్తుంది. ఎవరైనా అతన్ని ఉప్పుగూర్చి ప్రశ్నిస్తే కారంగూర్చి జవాబిస్తాడు. పై అధికారులపట్ల అతనికి గౌరవం లేదంటే పోనీయండి, అసలతనికి వారి యెడల ఉండేది అలక్ష్యం, ద్వేషం మాత్రమే.

నవనీతరావు ఈ ఆఫీసులో చేరి దాదాపు రెండు సంవత్సరాలైంది. ఇతనికి ముందు అదే పోస్టులో పనిచేసిన మహా బలేశ్వరరెడ్డి చార్జిహాండోవర్ చేసేటప్పుడు కిష్టయ్య ప్రవర్తన గూర్చి హెచ్చరిక చేయటం జరిగింది.

''నవనీతం... ఈ ఆఫీసులో నీకెలాంటి ఇబ్బందీ ఎదురవదు. మా ఛీఫ్ ఇంజనీరు, ఇంజనీయర్ ఇన్ ఛీఫ్ వీళ్ళంతా చాలా మంచివాళ్ళు. మా క్రింద పనిచేసే సిబ్బందిలో ఎవరూ గూడా గొడవ చేసేవారు లేరు. కానీ, మా ఆఫీసు రూం బయట కూర్చొని ఉంటాడే రౌడీ వెధవ కిష్టయ్య, అతనిన్నుండే ఎన్నో సమస్యలెదురైనాయి నాకు, నీవు చాలా మెత్తని వాడవైనందువల్ల అతన్నుండి నీకు తలనొప్పి అధికంగా ఉంటుంది. అతణ్ణి ఇక్కడనుండి పంపించటానికి నేను చాలా ప్రయత్నాలు చేశాను. అతని దగ్గర బంధువు ఒకడు కాబినెట్‌లో ఉన్నందువల్ల కిష్టయ్యను ఏమంటానికీ వీలు లేకుండా ఉంది. ఆ మంత్రితో నాక్కొంచెం

పరిచయ ముండటంవల్ల ఆయన కిష్టయ్యకు సర్ది చెప్పటం జరిగింది. నేను వెళ్ళింతర్వాత కిష్టయ్య మళ్ళీ తోకాడిస్తాడు. నిన్ను చూడటానికి వచ్చే సందర్శకులందరి దగ్గర నుండీ అతను డబ్బులు వసూలు చేస్తాడు. నీకు కొద్ది గౌరవమైనా అతనివ్వడు. అందుకే కొంచెం కేర్‌ఫుల్‌గా అతణ్ణి హేండిల్ చేయండి. మొదట్నుండీ అతనిపట్ల స్ట్రిక్ట్‌గా ఉండండి. నివారించటానికి సాధ్యంగాని రోగాన్ని భరించక తప్పదుగదా!''

నవనీతం కిష్టయ్యతో మాట్లాడటమే తక్కువ. అవసరమైన పనుల విషయంలో మాత్రం చాలా క్లుప్తంగా ఆదేశాలివ్వటం జరిగేది. వాగ్వివాదాలకు ఎప్పుడూ అవకాశం ఇవ్వలేదు. అయినా గానీ, కనీసం నెలకోసారైనా నవనీతానికి ఇబ్బంది కలిగేట్లు చేష్టలు రోజు రోజుకూ పెరగసాగాయి. ఒకటి రెండు పర్యాయాలు అతనిపట్ల కొద్దిగా కోపం ప్రదర్శించటం నవనీత రావుకు తప్పలేదు. దీంతో నవనీతరావు పట్ల అతని ప్రవర్తన మరింత అగౌరవనీయంగా మారింది. అతనడిగిన డబ్బు ఇవ్వలేదని, చివరకు గౌరవనీయుడైన ఒక కాంట్రాక్టర్‌ను కూడా నీచంగా తూలనాడాడు. దీనిపై వ్రాతపూర్వకమైన ఒక ఆరోపణ పత్రాన్ని కంట్రాక్టర్ నుండి తీసుకొని, నవనీతరావు అతణ్ణి సస్పెండ్ చేయటం జరిగింది. సస్పెన్షన్ ఆర్డర్‌ను తీసుకోవటానికి నిరాకరిస్తూ ''ఒరేయి ఇంజనీరూ... నీ తాతలాంటి వాళ్ళని చాలామందిని చూశాన్రా... చూస్తూఉండు... ఒక్క వారంలో నేను మళ్ళీ ఇక్కడకే వస్తాన్రా... అని పెద్దగా అరుస్తూ చెప్పాడతను.

''తిరిగివస్తావేమో... కానీ నా దగ్గరకు మాత్రం రాకు...'' అని చెప్పకుండా ఉండలేక పోయాడు నవనీతరావు.

''నేను తిరిగి వచ్చి అదే కుర్చీలో కూర్చొంటాను. నేను వద్దను కొంటే నీవే ఎక్కడికైనా ట్రాన్స్‌ఫర్ చేయించుకు చావు'' అంటూ అవహేళనకరంగా మాట్లాడుతున్నప్పుడూ, అతణ్ణి కొరికి చంపేద్దామన్న కోపం కల్గింది నవనీత రావుకు. అంతగా చెమటకంపు కొట్టే అతన్ని సమీపించటం ఇష్టం లేక నవనీతరావు తన కోపాన్నంతా తన పళ్ళ మధ్యనే పటపటలాడించాడు.

ఒక వారంలోపు ఏమీ జరగలేదు. కానీ పదవరోజు నవనీతం ఆఫీసుకొచ్చేటప్పుడు తాత్కాలికంగా అక్కడ అటెండర్‌గా పనిచేస్తున్న కరీముల్లా తలగీరుకొంటూ నిలబడి ఉన్నాడు. కిష్టయ్య తన పాత సింహాసనంపై ఆసీనుడై ఉన్నాడు. నవనీతరావు రావటం చూసి కిష్టయ్య లేవకపోవటమే కాదు, పెద్దగా కాండ్రించి ఉమ్మివేస్తున్నట్లుగా శబ్దం చేశాడు.

గదిలోపలకు వెళ్ళిన నవనీతరావు వెంబడివచ్చిన కరీముల్లాను '' ఏం జరిగింది?'' అంటూ అడిగాడు.

కిష్టయ్య సస్పెన్షన్‌ను ఉపసంహరించటమేగాక, తిరిగి యధాస్థానంలోనే అతన్ని నియమించినట్లుగా చెప్పాడు కరీముల్లా ఆవేదనతో.

మరొక్క క్షణమైనా ఆగదిలో కూర్చోలేక పోయాడు నవనీతం, ఛీఫ్ ఇంజనీరు వద్దకు పోయి తన దుఃఖాన్నీ, కోపాన్నీ బహిర్గతం చేశాడు. కానీ పాపం, అతను మాత్రం ఏం చేయగలడు!

మళ్ళీ నవనీతం తన ఆఫీసు గదికి వెళ్ళలేదు. ఇంజనీర్ ఇన్ ఛీఫ్‌ను, పి.డబ్ల్యు.డి సెక్రెటరీని నవనీతం సంప్రదించటం జరిగింది. కానీ వాళ్ళుగూడా అతని కేవిధంగా సహాయం చేయలేక పోయారు. కిష్టయ్యను కదిలించలేకపోతే, కనీసం తననైనా ట్రాన్స్‌ఫర్ చేయమని అతను వ్రాతపూర్వకంగా అభ్యర్థించాడు.

గుండె నొప్పిగా ఉందంటూ నవనీతం ఒక ప్రభుత్వ హాస్పిటల్‌లో అడ్మిట్ అయినాడు. డాక్టర్ సర్టిఫికెట్‌తో అతను మెడికల్ లీవు తీసుకొన్నాడు.

ఒక మాసంలోపలే ప్రభుత్వం వల్లమాలిన దయచూపెడుతూ నవనీతానికి ట్రాన్స్‌ఫర్ ఆర్డర్‌ను ప్రసాదించింది.

ఈ విషయం తెలుసుకొన్న కిష్టయ్య పగలబడి నవ్వాడంటే అందులో అతని తప్పేముంది?